## క్లుప్తంగా

### మున్సిపల్ కమిషనర్‌గా రవీంద్ర



కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

**అద్దంకి రూరల్:** అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా డీ. రవీంద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. ఒంగోలు నుంచి ఉద్యోగోన్నతిపై అద్దంకి వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ బదిలీపై ఏలేశ్వరం వెళ్లారు.

### స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల బహూకరణ

**సంతమాగులూరు (అద్దంకి):** మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో గురువారం పాఠశాల చైర్మన్ మక్కెన అంజయ్య, వైస్ చైర్మన్ కొల్లూరి కొండయ్య స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలను బహూకరించారు. కార్యక్రమంలో ఎస్ఈ మెంబర్స్ నన్నపనేని అర్చన, దుళ్ల శ్రీను, నంబూరి మౌనిక, లక్ష్మి, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

### మాగుంట పార్వతమ్మకు నివాళులు



పార్వతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల విద్యార్థినులు

**మార్టూరు:** మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాలల వ్యవస్థాపక కమిటీ మెంబర్ మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, మాగుంట పార్వతమ్మ మృతి పట్ల వలపర్ల మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాలలో గురువారం ఆమెకు ఘన నివాళులు అర్పించారు. మాగుంట చారిటబుల్ ట్రస్టు ద్వారా 1992లో ప్రకాశం జిల్లాలో స్థాపించిన 16 జూనియర్ కళాశాలలో వలపర్ల కళాశాల ఒకటి. అప్పట్లో గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కళాశాల ద్వారా పేద విద్యార్థులు ఎంతోమంది ఇంటర్మీడియట్ పూర్తి చేయగలిగారు. ఆమె మృతి సందర్భంగా పార్వతమ్మ చిత్రపటానికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, స్థానికులు ఘనంగా నివాళులర్పించారు.

### చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

**చీరాల:** విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ ఓ ప్రైవేటు కార్మికుడు గురువారం మృతి చెందాడు. ఈఘటన వేటపాలెం మండలం కొత్తపేటలో బుధవారం సాయంత్రం వెంకటస్వామి అనే కార్మికుడు విద్యుత్ స్తంభం ఎక్కి విద్యుత్ పనులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ రావడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చీరాలలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మంత్రి నుంచి చెక్కులు అందుకుంటున్న లబ్ధిదారులు

**అద్దంకి రూరల్:** వైద్య చికిత్స కోసం ప్రభుత్వం అందజేస్తున్న సీఎంఆర్ఆఫ్ చెక్కులను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పంపిణీ చేశారు. గురువారం చిలకలూరిపేటలోని ఆయన నివాసంలో అద్దంకి నియోజకవర్గం లోని ఐదుగురు లబ్దిదారులకు అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ. 15 లక్షల చెక్కులను అందజేశారు.

### సిమెంట్ రోడ్ల నిర్మాణాలు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

**చినగంజాం:** ప్రజా వేదిక కార్యక్రమంలో బాగంగా గురువారం మండలంలోని పెదగంజాం, నీలాయపాలెం గ్రామాల్లో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణాలను అధికారులు ప్రారంభించారు. 100 శాతం ఉపాధి హామీ నిధులతో పెదగంజాం గ్రామంలో రెండు ప్రాంతాలలో రూ.22 లక్షలు ఖర్చుతోను, నీలాయపాలెం గ్రామంలో రూ.17 లక్షల నిధులతో నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ డీ దాసు, ఉపాధి హామీ ఏపీఓ మహాలక్ష్మి, పెదగంజాం సర్పంచ్ నక్కల కృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అమ్మో కరెంటు తీగలు !

- పెదగంజాంలో తెగిపడుతున్న కరెంటు తీగలు
- తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- నిద్రపోతున్న విద్యుత్‌శాఖ అధికారులు



పూర్తిగా విరిగి పోయి స్తంభంపై ఉన్న ఇనుప కాసారం



ప్రధాన రహదారిలో తెగిపడిన విద్యుత్ తీగ

**చినగంజాం:** ఆ గ్రామ వీధుల్లో నడవాలంటే భయం. ఎప్పుడు ఎక్కడ ఏ సమయంలో తీగలు మీద పడుతాయోమోనని భయం. చీకటయితే మరో భయం. ఎక్కడా తీగలు పడిఉంటాయోమోనని ఆచితూచి వెళ్తున్నారు పెదగంజాం గ్రామస్తులు. కాలం చెల్లిన కరెంటు తీగలు.. దశాబ్దాలు గడచినా మార్చని విద్యుత్ శాఖ అధికారులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం పెదంగంజాం ప్రధాన సెంటర్‌లో భారీ జన సంచారం ఉన్న సమయంలో శిథిలావస్థకు చేసిన స్తంభం నుంచి విద్యుత్ ఉన్న సమయంలో కరెంటు తీగ తెగి నేలపై పడింది. ఆ సమయంలో పలువురు చిన్నారులు అక్కడే ఆడటాడుకుంటూ ఉంటుండగా రెప్పపాటు కాలంలో ప్రమాదం తప్పింది. ఒక్కసారిగా గ్రామంలోని ప్రజలందరూ ప్రమాదం తప్పిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని మేజర్ పంచాయతీలలో పెదగంజాం పంచాయతీ ఒకటి, పంచాయతీలో 10 గ్రామాలకు పైగా ఉన్నాయి. పెదగంజాంలో 5 దశాబ్దాల క్రితం మొదటగా కరెంటు సౌకర్యాన్ని కల్పించారు. అందులో భాగంగా గ్రామంలో కరంటు స్తంభాలు, తీగలు, ఇతర మెటీరియల్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో కొత్తగా పెదగంజాంలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. కాని అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామంలో శిథిల స్థితికి చేరుకున్న విద్యుత్ తీగలు, స్తంభాలు ఇతర మెటీరియల్‌ను అధికారులు మార్చనేలేదు.

**తరచుగా తెగిపడుతున్న తీగెలు..**

కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు, కరంటు తీతెలు తరచుగా తెగిపడుతున్నాయి. దశాబ్దాలు నాటి స్తంభాలు ఒరిగిపోయాయి. స్తంభాలకు ఏర్పాటు చేసే కాసారాలు తుప్పు పట్టి విరిగిపోయి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. నాణ్యత లోపించిన కరెంటు తీగలు తెగిపోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందేమోనని ప్రజలు భయాందోళనకు గురవతున్నారు. ఇప్పటికైనా అధికారులు పాడైపోయిన కరెంటు తీగలను మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

> **కరెంటు తీగెలు, మెటీరియల్ మార్చేందుకు చర్యలు..**
> పెదగంజాంలో గ్రామంలో దెబ్బతిన్న విద్యుత్ తీగలను, మెటీరియల్‌ను, స్తంభాలను తక్షణం మార్చేందుకు చర్యలు తీసుకుంటాం. స్థానికంగా గ్రామ ప్రజలతో సంప్రదించి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే పరిష్కరిస్తాం.
> – గణనారాయణ, విద్యుత్ శాఖ ఏఈ, చినగంజాం

> **కరెంట్ తీగలు తెగిపడుతున్నాయి.**
> పెదగంజాం గ్రామంలో 50 ఏళ్ల క్రితం వేసిన కరెంట్ తీగలు కావడంతో తరచుగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తీగలు, స్తంభాలు పురాతనమైన కావడంతో తీగలు తెగిపడుతున్నాయి. ఏ సమయంలో ఎలాంటి ప్రమాదాలు ఎదుర్కోవాల్సి వస్తుందని భయాందోళనగా ఉంది. వెంటనే అధికారులు సమస్యను పరిష్కరించాలి.
> -ఎం శ్రీరామ్ మూర్తిరెడ్డి, మాజీ ఎంపీటీసీ

# ఇసుక బస్తా రూ. 100

- గగ్గోలు పెడుతున్న భవన నిర్మాణ యజమానులు
- పనులు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులు
- ఉచిత ఇసుక అటకెక్కినట్టేనా



ఇసుక నింపిన బస్తాలు

**జే.పంగులూరు:** ఫ్రీ.. ఫ్రీ.. ఇసుక ఫ్రీ. కేవలం సీఎం చంద్రబాబు అండ్ కో మాటల్లోనూ.. భజన చేసే తమ అనుకూల మీడియాలో మాత్రమే కనిపిస్తుందే తప్పా ఎక్కడా ఇసుక దొరికిన దాఖాలాలు లేవు. మీకు కనిపిస్తున్న సిమెంట్ బస్తాల్లో సిమెంటు లేదు. అందులో ఉన్నది ఇసుక. ఆ సిమెంటు బస్తాలలో పట్టే ఇసుక ఖరీదు రూ. 100 అంటే మీరు నమ్ముతారా !. మీరు నమ్మినా నమ్మకపోయిన ఇది మాత్రం నిజం. ఇల్లు నిర్మించుకునే యజమానులు గత మూడు నెలలుగా ఇసుక దొరక్క, భారీ రేట్లకు ఇసుకను కొంటున్నారు. ఒక పక్క ప్రభుత్వం ఉచిత ఇసుక ఇస్తామని చెప్తున్నా.. ఎక్కడా ఇసుక దొరక్క, ఇసుక ఎప్పుడు వస్తుందో తెలియక నిర్మాణాలు అగిపోతున్నాయి. కొంత మంది అధిక రేట్లకు తీసకొచ్చి భవన నిర్మాణ పనులు చేసుకుంటున్నారు. ఈ లెక్కన ఒక ట్రక్కు ఇసుక కావాలంటే రూ. 12 వేలు నుంచి రూ.14 వేలు వరకు అవుతుంది. ఇది భవన నిర్మాణ యజమానుల ఇబ్బంది. అయినా తప్పడం లేదని కొంతమంది చెప్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి పాలకులు ఉచిత ఇసుక ఇస్తామని చెప్పడంతో, ఇసుక కోసం ఎదురుచుస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇసుక ఇబ్బదిలేకుండా ఉండేదని చెప్పిన వెంటనే వచ్చేదని, ఇప్పుడు ఇసుక కాదు కదా డబ్బులు పెట్టికొందాం అన్నా దొరకడం లేదని వాపోతున్నారు. ఈ ప్రాంతంలో గుండ్లకమ్మ, సముద్ర తీర ప్రాంతమైన కడవకుదురు నుంచి ఇసుక రావడం లేదు. కృష్ణానది నుంచి ఇసుక తెప్పించుకోవాలంటే టన్ను రూ. 2 వేల ధర పలుకుతుంది. ఒక ట్రక్కు నాలుగు టన్నులు పడుతుంది. బాడుగతో కలుపుకొని ట్రక్కు ఇసుక రూ. 12 వేలు ధర పలుకుతుందని చెప్తున్నారు. ఈరేట్లతో తాము ఎలా ఇల్లు నిర్మించుకోవాలని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమలు చేసి వెంటనే ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

# పోరాట పటిమ కలిగిన మహిళ ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

**అద్దంకి:** పోరాట పటిమ కలిగిన వీర వనిత చాకలి ఐలమ్మగా పేరుగాంచిన చిట్యాల ఐలమ్మ అని పట్టణ మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని ఏపీ.ఎస్సీ, ఎస్టీ,బీసీ అండ్ మైనార్టీస్ ఐక్యవేదిక, సాహితీవేత్తల ఆధ్వర్యంలో అద్దంకి మెయిన్ రోడ్‌లోని ప్రియదర్శిని ఫర్నిచర్స్ దగ్గర గురువారం ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భూ పోరాటాలు చేసి పటేల్, పట్వారీ, రజాకార్ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడిందన్నారు. కమ్యూనిస్టు పార్టీలో ప్రముఖ పాత్ర వహించి ఆమె జీవితకాలంలో తన పోరాటాల ద్వారా పదివేల ఎకరాల భూమిని భూస్వాముల నుంచి పేదలకు పంచేలా చేసినదని చెప్పారు. ఆమె నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆమె బాటలో అందరూ నడిచి పోరాటాలు చేసి పేదలకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అన్నమనేని వెంకటరావు కామ్రేడ్ చాకలి ఐలమ్మను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, చెన్నుపాటి రామాంజనేయులు, ఉబ్బా దేవపాలన, ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, చెన్నుపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# లింగాకర్షక బుట్టలతో పురుగుల ఉధృతికి చెక్



కొప్పరపాలెంలో వరి పొలాన్ని పరిశీలించి సూచనలిస్తున్న ఏవో



శంఖవరప్పాడులో మాట్లాడుతున్న ఏవో వెంకటకృష్ణ

**బల్లికురవ/అద్దంకి:** పత్తి పంటలో రసం పీల్చు పురుగును నివారించకుంటే పంట నష్టపోవాల్సి ఉంటుందని వ్యవసాయాధికారిణి కుమారి అన్నారు. ఆమె గురువారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొప్పెరపాలెం గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి రైతులతో కలిసి పత్తి, వరి పొలాలను సందర్శించి పత్తిలో రసం పీల్చు పురుగుల పచ్చదోమ, తెల్లదోమ, పేనుబంక గమనించి రైతులకు నివారణ చర్యలు సూచించారు. వీటి థయోమిథాక్సం 40 గ్రాములు లేదా అసిటామిప్రిడ్ 40 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుత వాతావరణంలో గులాబి రంగు పురుగు వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నందున రైతులు లింగాకర్షక బుట్టలు ఎకరాకు ఐదు పెట్టుకోవాలన్నారు. దీని ద్వారా పురుగు ఉనికిని గమనించి చర్యలు తీసుకోవడం ద్వారా దిగుబడులు సాధించవచ్చన్నారు. గులాబి పురుగును గుడ్డు దశలోనే నిర్మూలించడానికి 5% వేపగింజల కషాయం, లేదా ఎకరానికి వేప నూనె 1 లీటరు లేదా ప్రొఫెనోఫోస్ 400 ఎంఎల్ లేదా థయోడికార్బ్ 250 గ్రాములు ఏదో ఒకదానిని పిచికారీ చేసుకోవాలన్నారు. పత్తిలో బోరాన్ లోపం నివారణకు 60, 90 రోజులకు 300 గ్రాముల చొప్పున బోరాక్స్ పిచికారీ చేసుకోవాలన్నారు. పంట చివరి దశలో మాత్రమే సింథటిక్ పైరిత్రాయిడ్స్ వాడుకోవాలన్నారు. ఖరీఫ్ ఈ పంట సెప్టెంబర్ 28తో ముగుస్తుందని ఇంకా ఎవరైనా నమోదు చేయించుకోకపోతే చేయించుకోవాలని కోరారు. పశు వైద్యాధికారి మహేష్ పశువుల్లో వచ్చే వ్యాధులు, టీకాలు, గురించి వివరించారు. కార్యక్రమంలో వీఏఏ బాషా, పశు సంవర్ధక సహాయకులు లక్ష్మీకాంత్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

**సూక్ష్మ పోషకాల నివారణతో అధిక దిగుబడులు..**

వరిలో సూక్ష్మ పోషకాల నివారణతో అధిక దిగుబడులు సాధించవచ్చని అద్దంకి మండల వ్యవసాయాధికారి కొ్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని శంఖవరప్పాడు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దానిలో భాగంగా వ్యవసాయాధికారి వరి పొలాలను పరిశీలించి జింక్ లోపాన్ని గుర్తించి వాటి నివారణ కొరకు చిలేటేడ్ జింక్ ఎకరాకు 100 గ్రాములు వారంలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఉద్యాన అధికారి ఎస్.దీప్తి మాట్లాడుతూ కూరగాయలు సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.8 వేలు చొప్పున విత్తనాలకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. పూల తోటలకు ఎకరాకు రూ.6200 అందిస్తున్నట్లు తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ అశోక్ మాట్లాడుతూ ఎర్ర జొన్నలు రాయితీపై అందిస్తామని తెలిపారు. అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె ధనరాజ్ మాట్లాడుతూ అన్ని రైతు సేవా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ భూపతి రాంబాబు, వీఏఏ ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

# విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

**చీరాల రూరల్:** న్యాయవాద వృత్తికి విఘాతం కలిగించే విధంగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీరు ఉందని చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌరవ రమేష్‌బాబు, కొటిక ఉదయ భాస్కర రావులు పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీరును తీరుని నిరసిస్తూ గురువారం న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాద వృత్తి ఎంతో సవాళ్లతో కూడుకున్నదని అయినప్పటికి కక్షిదారులకు న్యాయ సహాయాన్నందించడంలో న్యాయవాదులు రేయింబవళ్లు ఎంతో కష్టపడుతుంటారని చెప్పారు. అటువంటి న్యాయవాదులపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతిసారి న్యాయవాద వృత్తిపై ఏదో ఒక సవరణ చేస్తూ వృత్తిని విచ్ఛిన్నం చేసే విధంగా ప్రయత్నించడం మంచి పద్ధతి కాదన్నారు. న్యాయవాదుల రక్షణకు ఇప్పటివరకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎటువంటి రక్షణ చట్టాలను అమలుచేయలేదని విమర్శించారు. న్యాయవాదులకు రక్షణ చట్టాలు లేకపోవడం కారణంగా న్యాయవాదులను కక్షిదారులు, పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వాలతో పాటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కలుగచేసుకుని న్యాయవాదులకు రక్షణ చట్టాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

# 29న చీరాలలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం



వైద్య శిబిరం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

**చీరాల:** జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ కంటి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ డాక్టర్ చుండూరి నాగేశ్వరరావు, లలిత దంపతుల సహకారంతో ఈనెల 29న ముంతావారిసెంటర్‌లోని ఎన్వీఎస్అండ్ఎస్‌జెఆర్ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీరాం సురేష్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంజీసీ మార్కెట్ వద్ద వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ప్రతినిధులు ఆవిష్కరించారు. గత మూడేళ్లుగా నాగేశ్వరరావు దంపతుల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తునానమన్నారు. కంటి వైద్యపరీక్షలతో పాటు శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా చేస్తామన్నారు. ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. చీరాల పరిసర ప్రాంత ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాం వేణుగోపాల్, వేముల చంద్రశేఖర్, కోట శ్రీమన్నారాయణ, మంచికంటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# చదువులతో పాటు క్రీడలకు ప్రాధాన్యత



క్రీడాపోటీలను ప్రారంబిస్తున్న డీప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

**వేటపాలెం:** విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు డీప్యూటీ డీఈఓ అబ్బరాజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలను డీప్యూటీ డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఆటలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. అందుకు అనుగుణంగా వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతి రోజు ఒక గంట సమయం విద్యార్థులకు ఆటలు, యోగాసనాలతో శిక్షణ ఇవ్వాలని సూచించారు. మరో ముఖ్యఅతిథి అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు నక్కల అర్జునరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆటలతో పాటు చదువుల్లోనూ రాణించాలన్నారు. శారీరక, మానసిక వికాసంతో పాటు జీవితంలో ఉద్యోగ భద్రతలకు కూడా అవకాశం ఉంటుందన్నారు. అనంతరం అథ్లెటిక్స్, షటిల్ బ్యాట్మింటన్, యోగా, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎమ్‌సీ చైర్మన్ చెరుకూరి రాంబాబు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు శ్రీమన్నారాయణ, పిచ్చుక నాగరాజు, ప్రదీప్, హెచ్ఎం శేషగిరిరావు, భవనం బద్రిరెడ్డి, పాల్గొన్నారు.

### మార్టూరు సీఐకు ఎస్పీ అభినందనలు



ఎస్పీ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న సీఐ

**మార్టూరు:** మార్టూరు సీఐ మద్దినేని శేషగిరిరావును బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ గురువారం అభినందించి ప్రశంస పత్రం అందజేశారు. ఈనెల 13వ తేదీ నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో భాగంగా మార్టూరు సర్కిల్ పరిధిలోని ఎక్కువ కేసులను రాజీమార్గాన పరిష్కరించినందుకుగాను సీఐ పురస్కారం అందుకున్నారు.

### క్రీడాకారులకు అభినందనలు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**వేటపాలెం:** జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. స్థానిక అల్పాస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపికై నట్లు గేమ్స్ కోఆర్డినేటర్ సీతాదేవి తెలిపారు. గురువారం నియోజకవర్గ స్థాయిలో పందిళ్లపల్లి క్రీడా మైదానంలో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో స్కూల్ విద్యార్థులు అండర్-14 విభాగంలో స్వీజాన్ రెడ్డి, జోషిక, నిధి, లిఖిత్‌సాయి, అండర్-17 విభాగంలో తారక్ రామ్, చరితదత్త జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను పీఈటీ సురేష్, ప్రిన్సిపాల్ రామన్‌రఘనాథ్, ఏజీఎం చంటిబాబు అభినందించారు.

### స్వచ్ఛ చీరాల మనందరి బాధ్యత



స్వచ్ఛ చీరాల ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

**చీరాల:** స్వచ్ఛ చీరాలలో అందరూ బాధ్యులు కావాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. గురువారం స్వచ్ఛ చీరాల-స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మహాత్మా గాంధీజీ ఎటువంటి దేశాన్ని చూడాలని కలలు కన్నారో అది ఒక స్వతంత్ర రాజకీయ భారతమే కాకుండా పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన దేశం కావాలని ఆయన సంకల్పించారు. దీనికి స్ఫూర్తిగా తీసుకొని స్వచ్ఛ చీరాల స్వచ్ఛ-ఆంధ్రప్రదేశ్ సాధించి తద్వారా స్వచ్ఛ భారత్ సాధించే లక్ష్యంతో తాను కృషి చేస్తామని అందరితో కలిసి ముక్కోణం పార్కు సెంటర్‌లో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### మార్టూరు సబ్ రిజిస్ట్రార్ బదిలీ



సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్‌లను సన్మానిస్తున్న సిబ్బంది

**మార్టూరు:** మార్టూరు సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న మేకల చిన్న రామకోటయ్య కందుకూరు సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు. ఇదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వీజే పవన్ కుమార్ ఒంగోలుకు బదిలీ అయ్యారు. సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రార్ ఇస్మాయిల్ షరీఫ్ మార్టూరు సబ్ రిజిస్ట్రార్‌గా నేడు బాధ్యతలు చేపట్టనున్నారు. బదిలీ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ రామకోటయ్యను సీనియర్ అసిస్టెంట్ పవన్ కుమార్‌లను కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

### పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ



విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను బహూకరిస్తున్న దాతలు

**ఇంకొల్లు (చినగంజాం):** పేద విద్యార్థినికి ఓస్వచ్ఛంద సంస్థ ల్యాప్‌టాప్ బహూకరించింది. పూసపాడు గ్రామానికి చెందిన వీ అఖిల నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతోంది. ఆమెకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు గురువారం గ్రామంలోని విఘ్నేశ్వర ఫంక్షన్ హాలులో సంస్థ ప్రెసిడెంట్ కొమ్మాలపాటి శ్రీనివాసరావు ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. మిత్రులు యార్లగడ్డ రామకృష్ణ, నాదెండ్ల రామచంద్రరావు, లంకా కృష్ణ, వడ్లమూడి శివయ్యల ఆర్థిక సహకారంతో ల్యాప్‌టాప్ అందించారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు సాంబశివరావు, మేనేజర్ సాయికిరణ్, యలమంచిలి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు బొల్లాపల్లిలో రైతులకు అవగాహన సదస్సు

**మార్టూరు:** మండలంలోని బొల్లాపల్లి రైతు సేవా కేంద్రంలో నేటి ఉదయం పది గంటలకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు రైతు సంఘం మండల కార్యదర్శి వీరవల్లి కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సంఘం అభ్యర్థన మేరకు మండల వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో గుంటూరు లాం, దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సదస్సులో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ దస్సులో ప్రధానంగా వరి, మొక్కజొన్న, మినుము, శనగ పంటలపై శాస్త్రవేత్తలు రైతులకు శిక్షణ కల్పిస్తారని, మండలంలోని రైతులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.